క్లుప్తంగా

బీజేపీ గెలుపే లక్ష్యంగా ముందుకు..



నియామక పత్రం అందుకుంటున్న రాము

కొందుర్గు: బీజేపీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆ పార్టీ జిల్లేడ్ చౌదరిగూడ మండల అధ్యక్షుడు కుర్మయ్య అన్నారు. మంగళవారం మండలంలోని ఎదిర గ్రామంలో బూత్ కమిటీని ఏర్పాటు చేశారు. గ్రామ బూత్ కమిటీ అధ్యక్షుడిగా జోగు రాము ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కుర్మయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పేదల కోసం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజు, మురళి, నర్సింలు, రాజ్ కుమార్, తిరుపతి పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంటి వెలుగు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కొందుర్గు: మండల కేంద్రంతో పాటు ముట్పూర్ గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతుందని మండల వైద్యాధికారి డాక్టర్ అమ్రిత జోసెఫ్ తెలిపారు. కంటి వెలుగు ఈ నెల 19న ప్రారంభం కాగా, ఇప్పటివరకు 1368 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ అమ్రిత జోసెఫ్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ తబుసుమ్, డాక్టర్ అబ్దుల్ హలీమ్, డాక్టర్ ప్రవీణ, ఏఎన్ఎంలు, ఆశలు , పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కంటి వెలుగుతో ప్రయోజనం

శంకర్‌పల్లి: కంటి వెలుగు కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని రావుపల్లి కలాన్ సర్పంచ్ పావని పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రావులపల్లి కలాన్ గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆమె పరిశీలించారు. కంటి సమస్యలు ఉన్న వారికి అద్దాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కంటి వెలుగు శిబిరాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రజలకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దయాకర్‌రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కొత్తూరు: పండితులు, పీఈటీల పోస్టులను ప్రభుత్వం వెంటనే అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ మంగళవారం మండలకేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రభుత్వం గత కొన్నేళ్ల నుంచి పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తామని ప్రకటిస్తున్న అమలు చేయడం లేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పీఈటీలు, పండితుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొత్తూరు జెడ్పీహెచ్ఎస్ పీడీ విజయ్‌సాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు అవార్డులు



పతకాలు అందుకున్న ఏఎస్ఐ, కానిస్టేబుళ్లు

కొందుర్గు: ఉత్తమ సేవలకు పలువురు పోలీసులకు మంగళవారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఉత్తమ సేవా పతకాలను అందజేశారు. శంషాబాద్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీపీ పతకాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లేడు చౌదరిగూడ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ బాలస్వామి అతి ఉత్రిష్ట్ సేవా పథకం , హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్ సేవా పథకం, కానిస్టేబుల్ ఎల్లాగౌడ్ ఉత్రిష్ట్ సేవాపథకం, కొందుర్గు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ చెన్నయ్యలు ఉత్తమ సేవా పథకాలను సీపీ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

ఘనంగా బాలికల దినోత్సవం

కొందుర్గు: కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రాలతో పాటు పద్మారం, తుమ్మలపల్లి, తంగెళ్లపల్లి, ముట్పూర్ తదితర గ్రామాల్లో మంగళవారం బాలికల దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తంగెళ్లపల్లి గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ బాల్‌రాజ్ పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ బాలికల కోసం ఎన్నో పథకాలను అందుబాటులోకి తీసుకొచ్చాడని అన్నారు. కేసీఆర్ కిట్ పథకం, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకంతో ఆడపిల్లకు లబ్ది చేకూర్చుతున్నారు.

జీవామృతం.. పంటకు జీవం

- జీవామృతం తయారీ, ఉపయోగించే విధానం
- మండల వ్యవసాయాధికారి రాగమ్మ





డబ్బాలో తయారు చేస్తున్న జీవామృతం

మొయినాబాద్: వ్యవసాయంలో రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం వల్ల భూమిలో సూక్ష్మజీవరాశి, సేంద్రియ పదార్థం నశించి పొలాలు నిస్సారమైపోతున్నాయి. ఈ దశలో భూమిని తిరిగి సారవంతం చేయడం అత్యవసరం. అందుకు 'జీవామృతం' చక్కగా ఉపయోగపడుతుందని మండల వ్యవసాయాధికారి రాగమ్మ తెలిపారు. జీవామృతం తయారీ, వినియోగించే విధంగా ఆమె తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకృతి వ్యవసాయ రథానికి నాలుగు చక్రాలు. వాటిలో జీవామృతం ఒకటి. మిగతావి.. బీజామృతం, ఆచ్ఛాదన, నీటి యాజమాన్యం.

జీవామృతం ద్వారా భూమిలో సూక్ష్మజీవులు, వానపాములు ఇబ్బడిముబ్బడిగా వృద్ధి చెందుతాయి. మట్టిలో నిద్రావస్థలో ఉన్న సూక్ష్మజీవులు, వానపాములను చైతన్యం చేయడం ద్వారా జీవామృతం భూసారం పెరగడానికి దోహదపడుతుంది. భూమిలోని పోషకాలను మొక్కలు నేరుగా వినియోగించుకునే రూపంలోకి మార్చి అందించడంలో వానపాములు, సూక్ష్మజీవుల పాత్ర అసాధారణమైనది. మేలు చేసే కోట్ల సూక్ష్మజీవులకు నిలయం పశువుల పేడ, పశువుల మూత్రం. పేడ, మూత్రంతో పాటు బెల్లం, పప్పుల పిండి, నీటిని కలిపినప్పుడు.. పేడలోని సూక్ష్మజీవరాశి ప్రతి 20 నిమిషాలకు రెట్టింపు అవుతుంది.

జీవామృతం తయారీ విధానం..

ఎండ తగలని చోట పెట్టిన సిమెంటు తొట్టి లేదా ప్లాస్టిక్ పీపాలో 200 లీటర్ల నీటిని నింపాలి. పశువుల పేడ, మూత్రం, బెల్లం, పిండి తదితరాలను అందులో వేసి బాగా కలపాలి. గడియారం ముల్లు తిరిగే దిశగా అంటే సవ్యదిశలో కర్రతో కలియతిప్పాలి. దానిపై గోనె సంచి కప్పాలి. ఉదయం ఒక నిమిషం, సాయంత్రం ఒక నిమిషం కలియతిప్పుతూ ఉండాలి. అందులోని సూక్ష్మజీవరాశి ప్రతి 20 నిమిషాలకోసారి రెట్టింపు అవుతూ ఉంటుంది. 48 గంటల తర్వాత వాడకానికి జీవామృతం సిద్ధమవుతుంది. అప్పటి నుంచి వారం రోజుల్లోగా ఉపయోగించాలి. ఎకరానికి 200 లీటర్ల జీవామృతాన్ని ప్రతి 15 రోజులకోసారి సాగు నీటితో పాటు వాడాలి. లేదా భూమిలో పదునుంటే నేరుగా చల్లాలి. జీవామృతాన్ని అన్ని పంట పొలాల్లోనూ వాడవచ్చు.. పంటలపైన పిచికారీ చేయొచ్చు.

జీవామృతం తయారీకి కావాల్సిన పదార్థాలు (ఎకరం పొలానికి)...

- ▲ 200 లీటర్ల నీళ్లు
- ▲ 10 కిలోల పశువుల (ఆవు, ఎద్దు, గేదెల) పేడ
- ▲ 5 నుంచి 10 లీటర్ల పశువుల మూత్రం
- ▲ 1 నుంచి 4 కిలోల బెల్లం (నల్లబెల్లం శ్రేష్ఠమైనది)
- ▲ కిలో పప్పుధాన్యాల పిండి (ఉలవ, అలసంద, కంది, మినప, పెసర పిండి.. ఏదైనా కలిపి వాడొచ్చు)
- ▲ పొలం గట్టు మట్టి.. పిడికెడు.
- ▲ పంటలపై జీవామృతం పిచికారీ విధానం..

3 నెలల్లో (60–90 రోజుల్లో) పూర్తయ్యే పంటలకు (ఎకరానికి)..

మొదటిసారి: (విత్తనం నాటిన నెలకు) 100 లీటర్ల నీటికి 5 లీటర్ల జీవామృతం కలిపి పిచికారీ చేయాలి.

రెండోసారి: (21 రోజుల తర్వాత) 150 లీటర్ల నీటికి 10 లీటర్ల జీవామృతం కలిపి పిచికారీ చేయాలి.

మూడోసారి: (21 రోజుల తర్వాత) 200 లీటర్ల నీటికి 20 లీటర్ల 'నీమాస్త్రం'ను కలిపి చల్లాలి.

నాలుగోసారి: (గింజ ఏర్పడుతున్న దశలో) 200 లీటర్ల నీటిలో 5 లీటర్ల పుల్లమజ్జిగ కలిపి పిచికారీ చేయాలి (ఈసారి జీవామృతం అక్కర్లేదు).

6 నెలల్లో (150 నుంచి 180 రోజుల్లో) పూర్తయ్యే పంటలకు (ఎకరానికి)..

మొదటిసారి: (విత్తనం నాటిన నెలకు) 100 లీటర్ల నీటికి 5 లీటర్ల జీవామృతం కలిపి చల్లాలి.

రెండోసారి: (30 రోజుల తర్వాత) 150 లీటర్ల నీటికి 10 లీటర్ల జీవామృతం కలిపి పిచికారీ చేయాలి.

మూడోసారి: (30 రోజుల తర్వాత) 200 లీటర్ల 'నీమాస్త్రం'ను చల్లుకోవాలి.

నాలుగోసారి: (30 రోజుల తర్వాత) 200 లీటర్ల నీటిలో 20 లీటర్ల జీవామృతం కలిపి పిచికారీ చేయాలి.

ఐదోసారి: (30 రోజుల తర్వాత) 200 లీటర్ల నీటిలో 20 లీటర్ల జీవామృతం కలిపి చల్లాలి.

ఆరోసారి: (గింజ ఏర్పడుతున్నప్పుడు) 200 లీటర్ల నీటిలో 6 లీటర్ల పుల్లమజ్జిగ (ఈసారి జీవామృతం అక్కర్లేదు) కలిపి పిచికారీ చేయాలి.

పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి వరం

ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణ లక్ష్మి పథకం పేదింటి ఆడబిడ్డలకు వరమని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్తు కార్యాలయంలో 21 కల్యాణలక్ష్మి, 12 సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి, వైస్ ఎంపీపీ జడలలక్ష్మి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూర్ నర్సింగ్‌రావుతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పేదింటి ఆడపిల్లల వివాహాలకు సీఎం కేసీఆర్ అండగా ఉంటున్నారని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సైదులుగౌడ్, డిప్యూటీ తహసీల్దార్ మధు, ఎంపీడీఓ అనురాధ, జిల్లా రైతు సంఘం సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, టీఆర్ఎస్ నాయకులు తదితరులున్నారు.

పేదింటి ఆడపడుచులకు అండగా ప్రభుత్వం

చేవెళ్ల: పేదింటి ఆడపడుచులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం మండలంలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల లబ్ధిదారులకు ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రంలో ఆడపిల్లలు ఉన్న తల్లిదండ్రులు ధైర్యంగా ఉంటున్నారు. కేసీఆర్ లాంటి నాయకుడు ఉండడం మనందరికి గర్వకారణమని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ మాలతి, వైస్ ఎంపీపీ శివప్రసాద్, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు , క్రిష్ణారెడ్డి, రవికాంత్‌రెడ్డి, వెంకటేశ్, యాదగిరి, విజయ్, గని, సాయినాథ్, తహసీల్దార్ పాల్గొన్నారు.

ఆస్పత్రి భవన నిర్మాణానికి నిధులు

షాబాద్: పశువుల ఆస్పత్రి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మంగళవారం రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సహకార సంఘం వైస్ చైర్మన్ మద్దూరు మల్లేష్, సర్పంచ్ రాములుతో కలిసి ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని రేగడిదోస్వాడ గ్రామంలోని పశువైద్యశాల పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉందన్నారు. స్పందించిన ఎమ్మెల్యే పాత భవనం స్థానంలోనే నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేసిన నాయకులు

మెరుగైన వైద్య సేవలు అందించాలి

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న జయలక్ష్మి

షాద్‌నగర్: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు వైద్య సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి సూచించారు. మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్ఓ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని వైద్యాధికారులు, ఏఎన్ఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ.. స్త్రీలు గర్భం దాల్చిన మూడు నెలలోపు వారి వివరాలను ఏఎన్ఎంలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. గర్భిణుల ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అన్నారు. గర్భిణీల ఆరోగ్య సంరక్షణపై ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు అందించాలని చెప్పారు. టీటీ ఇంజక్షన్లు, ఐరన్ మాత్రలను అందించాలని తెలిపారు. అలాగే, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసూతి చేయించుకునే విధంగా వారిని చైతన్య పరచాలని చెప్పారు. ఆరోగ్య సిబ్బంది, వైద్యులు ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది



విద్యార్థులకు డ్రమ్స్‌సెట్‌ను అందజేస్తున్న వెంకట్‌రెడ్డి

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు దాతల అందించే సహకారం మరువలేనిదని గుండాల ఉపాధ్యాయురాలు శివానందం అన్నారు. మండలంలోని గుండాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎల్ఐసీ సీనియర్ ఏజెంట్ వెంకట్‌రెడ్డి మంగళవారం విద్యార్థుల పరేడ్‌కు ఉపయోగించే డ్రమ్స్‌సెట్‌ను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను ప్రోత్సహించేందుకు దాతలు ఇచ్చే ప్రతి సహకారం వారికి ఎంతో మేలు చేస్తాయని చెప్పారు. ప్రతి ఒక్కరు పభుత్వ పాఠశాలను బలోపేతం చేసుకునేందుకు కృషి చేయాలని చెప్పారు. వెంకట్‌రెడ్డిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు. వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. చదువు ఎంతో విలువైనదని, విద్యార్థులు నిర్లక్ష్యం చేయకుండా చదువుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, చైర్మన్ యాదగిరి, గణేశ్, విద్యార్థులు ఉన్నారు.

విద్యార్థులు చదువుల్లో రాణించాలి

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు చదువుల్లో రాణించాలని ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్స్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీతాథామస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని విఠ్యాల, కిషన్, మొగిలిగిద్ద, షాద్‌నగర్ ప్రభుత్వ ఉర్దూ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గీతాథామస్‌రెడ్డి మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు చదువుల్లో తగిన ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. చదువుల్లో రాణించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆశయాలను విద్యార్థులు నెరవేర్చాలని అన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగి వాహనం నడిపితే చర్యలు

రాజేంద్రనగర్ జోన్ ట్రాఫిక్ ఎస్సై ఎక్బాల్

మొయినాబాద్‌రూరల్: ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని రాజేంద్రనగర్ జోన్ ట్రాఫిక్ ఎస్సై ఎక్బాల్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని జేబీఐఈటీ కళాశాల ఎదుట ట్రాఫిక్ సిబ్బందితో ఆయన డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం సేవించి వాహనాలు నడిపితే చాలన్‌లు, కేసులు తప్పవన్నారు. వాహనానికి సంబంధించిన సరైన పత్రాలు, లైసెన్స్ లేని వారికి చాలన్‌లు విధించడం జరుగుతుందన్నారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్



శివాలయాన్ని సందర్శించిన శంకర్

నందిగామ: సమాజంలోని ప్రతి ఒక్కరు దైవ చింతన అలవర్చుకోవాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని బుగ్గోనిగూడలో నూతనంగా నిర్మించిన శివాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తన వంతు విరాళంగా రూ.1 లక్ష 11 వేల నగదును ఆలయ నిర్మాణ కర్తలకు అందజేశారు. అనంతరం శంకర్ మాట్లాడుతూ.. దేవాలయాలను నిర్మించడమే కాకుండా నిత్యం దూప దీప నైవేద్యం కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు తమ దినచర్యలో ఎంతో కొంత సమయాన్ని దైవ చింతనకు కేటాయించాలని సూచించారు. ఈ ఆలయంలో మూడు రోజుల పాటు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, దేపల్లి కుమార్‌గౌడ్, నాయకులు శ్రావణ్, రాంచందర్, బుచ్చయ్య, శ్రీశైలం, సతీష్, మహేందర్, సాములయ్య, రాజశేఖర్, శివ,పాండు, శివ,అనిల్, భాస్కర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాశన్నకుంట చెరువును కాపాడాలి

కొత్తూరు: మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీ సమీపంలోని కాశన్నకుంట చెరువును కాలుష్యం, మురుగునీటి నుంచి కాపాడాలని స్థానికులతో పాటు మత్స్యకార సంఘం సభ్యులు ఇరిగేషన్ అధికారులను మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. గత కొన్నేళ్ల నుంచి చెరువులోకి ఆయా పరిశ్రమల వ్యర్థ జలాలు రావడంతో నీరు పూర్తిగా కలుషితం అవుతున్నట్లు పేర్కొన్నారు. దానికి తోడు పట్టణంలోని మురుగు నీరు సైతం చెరువులోకి వస్తుందన్నారు. దీంతో రోజు రోజుకు చెరువు ఉనికిని కోల్పోతుందని చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత ఇరిగేషన్‌శాఖ అధికారులు స్పందించి చెరువు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని మత్స్యకార సంఘం సభ్యులు కోరుతున్నారు.

కరెంట్ షాక్‌తో ఆవు మృతి

కేశంపేట: కరెంట్ షాక్ తగిలి పాడి ఆవు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని వేములనర్వ గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములనర్వ గ్రామ శివారులోని చౌదరిగూడ గ్రామంలోని రైతు మామిడిపల్లి కృష్ణారెడ్డికి చెందిన ఆవు పంట పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు మేతకు వెళ్లడంతో విద్యుత్ షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందింది. రైతును ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

జెండా పండుగకు క్రీడోత్సవాలు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో జెండా పండుగ సందర్భంగా ఆటల పోటీలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఆటల పోటీల వాతావరణం నెలకొంది. మంగళవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్, బాకారం, తోల్‌కట్ట, కనకమామిడి, అమ్డాపూర్, ముర్తుజాగూడ ఆయా గ్రామాల్లో దాతలు, ప్రజాప్రతినిధులు 26 జనవరి రోజున జెండా ఎగరవేసిన అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నారు. దీంతో ఆయా పాఠశాలలో విద్యార్థులు ఆటల పోటీల్లో మునిగితెలుతున్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: యువత క్రీడల్లో రాణించాలని బీజేపీ నేత పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గంట్లవెల్లి గ్రామంలో నిర్వహిస్తున్న జీపీఎల్ ప్రీమియర్ క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణప్రాంతాల్లో ఎంతో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని అన్నారు. టోర్నమెంట్‌లు క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు ఉపయోగపడుతాయని తెలిపారు. యువత క్రీడల్లో రాణించి తమ సత్తాను చాటి జాతీయ అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఆర్థిక ఇబ్బందులతో ఎంతో మంది క్రీడాకారులు ఉన్నత స్థాయికి ఎదగలేకపోతున్నారని చెప్పారు. వారికి తాము ఎల్లప్పుడు అండగా ఉంటామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా క్రీడాకారులకు క్రికెట్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌భాస్కర్, ప్రదీప్, సుభాష్‌రెడ్డి, సదానందంయాదవ్, అఖిల్‌కుమార్, ఆంజనేయులు, అబ్దుల్‌ఫారూక్, అంజి, నర్సింగ్, సురేష్, ముస్తాఫా పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు రుణాల పంపిణీ



సభ్యులకు రుణాలను అందజేస్తున్న అధికారులు

షాద్‌నగర్‌టౌన్: మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో మంగళవారం మహిళా సంఘాల సభ్యులకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు రుణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఠాకూర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బ్యాంక్ రీజినల్ హెడ్ రమణ హాజరై మాట్లాడుతూ.. మహిళా సంఘాల సభ్యులు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు ఆర్థికంగా పురోగాభివృద్ధి సాధించాలని చెప్పారు. ఈ సందర్భంగా రూ.1.60కోట్ల రుణాలను మహిళా సంఘాల సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సిరిగిద్ద లలిత, ఎంపీటీసీలు కోట్ల శ్రీశైలం, జయలక్ష్మి, రాధాకృష్ణ, ఉప సర్పంచ్ లావణ్య, మహేష్, శ్రీను, ఏపీయం నగేష్, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించండి



నిరసన వ్యక్తం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

ఏబీవీపీ కన్వీనర్ మహేష్

షాద్‌నగర్‌రూరల్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏబీవీపీ శంషాబాద్ శాఖ కన్వీనర్ చాకలి మహేష్ అన్నారు. మంగళవారం పట్టణ చౌరస్తాలో ఏబీవీపీ షాద్‌నగర్ నగర కార్యదర్శి సందీప్ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నాయకులు కళ్లకు గంతలు కట్టుకొని నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా గాలికి వదిలేసిందన్నారు. రాష్ట్రంలో రూ.5500కోట్ల ఫీజు రీయింబర్స్ స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం విడుదల చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. అదేవిధంగా ప్రభుత్వం ఇటీవల ఇంజనీరింగ్ ఫీజులను భారీగా పెంచిందని, ఈ ఫీజులను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయ కులు భాను, జగదీష్, వంశీ, సాయి, శ్రీశైలం, రాకేష్, శివమణి, శివ, బాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పెద్దపీట

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కోటి రూపాయలతో నూతనంగా నిర్మించ తలపెట్టిన మూడు అదనపు తరగతి గదులు, డైనింగ్‌హాల్, కిచెన్ షెడ్, మరుగుదొడ్లు, ఎలక్ట్రిఫికేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు అంతా విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తుందని చెప్పారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి తల్లిదండ్రులు కలలను సాకారం చేయాలన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

మండల పరిధిలోని కాశిరెడ్డిగూడ గ్రామంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ప్రారంభించారు. గ్రామంలో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనం, క్రీడాప్రాంగణం, మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు, వైకుంఠధామం, కంపోస్టు యార్డు, అంతర్గత మురుగు కాల్వలు, సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అహ్మద్, విశ్వం, లక్ష్మణ్‌నాయక్, పావని, నర్సింహ్మా, వెంకట్‌రాంరెడ్డి, శంకర్, భీష్వ రామకృష్ణ, కమిషనర్ వెంకన్న, ఎంఈఓ, హెచ్ఎం శివకుమారి పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

షాద్‌నగర్: సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కును మంగళవారం ఎమ్మెలే బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. పట్టణంలోని తిరుమల కాలనీకి చెందిన షాహిదా అనారోగ్యానికి గురైన ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆర్థిక సహాయం అందించాలని బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సీఎం సహాయ నిధి నుంచి రూ.60 వేలు మంజూరు చేయించారు. ఈ చెక్కును ఎమ్మె ల్యే బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజన్, శంకర్, నర్సింహ్మా, ఎంపీపీ ఖాజా ఇద్రీస్ పాల్గొన్నారు.